సాక్షి ఆదిలాబాద్

గురువారం । 5 । సెప్టెంబర్ । 2024

పోషక విలువలతోనే ఆరోగ్యం

ఆదిలాబాద్‌టౌన్: పోషక విలువలతో కూడిన ఆహారంతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని జిల్లా సంక్షేమ అధికారి సబిత అన్నారు. ఆదిలాబాద్‌లోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్.. పోషణ మాసం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ప్రొటీన్లు, విటమిన్లు, ఆకుకూరలు, కూరగాలతో కూడిన భోజనం తీసుకోవాలని సూచించారు.

విధుల్లోకి తీసుకోవాలని వినతి

కైలాస్‌నగర్: తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల పార్ట్‌టైం టీచర్లు ప్రభుత్వాన్ని కోరా రు. ఈ మేరకు అదనపు కలెక్టర్ శ్యామలాదేవిని బుధవారం కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా గురుకుల పాఠశాలల్లో సేవలందిస్తున్న తమను ప్రభుత్వం ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండా తొలగించడం సరికాదన్నారు.

గరిష్టం/కనిష్టం
31.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తుపాను ప్రభావం కారణంగా పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

జిల్లాకు నలుగురు కొత్త తహసీల్దార్లు

కై లాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లాకు నలుగురు కొత్త తహసీల్దార్లు నియామకమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 2023–24 ప్యానెల్‌కు సంబంధించిన నాయబ్ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించిన ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో పనిచేస్తున్న నలుగురిని జిల్లాకు బదిలీ చేసింది. వీరిలో గుగ్లావత్ పంచపూల (నిర్మల్),కె.రఘునాథ్‌రావు(ఆసిఫాబాద్), బి.గోవింద్, ఏ.కమల్‌సింగ్ (మంచిర్యాల)ను జిల్లాకు కేటాయిస్తూ సీసీఎల్‌ఏ రాష్ట్ర కమిషనర్ నవీన్‌మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త తహసీల్దార్ల రాకతో ఆదిలాబాద్ రూరల్, బేల, సిరికొండ మండలాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ అయ్యే అవకాశముంది.

మతవిద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు

ఆదిలాబాద్‌టౌన్: జైనూర్ ఘటనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ గౌస్ ఆలం పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంటుందని, ప్రజలు వదంతులు నమ్మవద్దని సూచించారు. జైనూర్‌లో 104 సెక్షన్ అమలులో ఉందని, ఇతరులు అక్కడికి వెళ్లడానికి అనుమతి లేదని ఎస్పీ తెలిపారు. ప్రజ లంతా సంయమనం పాటించాలని పేర్కొన్నారు. వాట్సాప్‌లో అసత్య ప్రచారం చేసే వారితో పాటు గ్రూప్ అడ్మిన్‌పై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉట్నూర్‌రూరల్: జిల్లాలోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలాల్లో ప్రజలు ఎలాంటి సభలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించకూడదని ఎస్పీ ప్రకటనలో తెలిపారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



ధర్నా చేస్తున్న బీసీ సంఘాల ప్రతినిధులు

కైలాస్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘ బాధ్యులు మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల సమయంలో ఆ పార్టీ అగ్రనేతలు ప్రకటించారన్నారు. దానికనుగుణంగా సమగ్ర కులగణన చేపట్టి బీసీ లకు రిజర్వేషన్లు ప్రకటించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్యామలాదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులోబీసీ సంఘాలనాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న కమిషనర్ ఖమర్ అహ్మద్

కైలాస్‌నగర్: ఈ నెల 7నుంచి ప్రారంభం కానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ అన్నారు. ఈ మేరకు ఏర్పాట్లపై వర్క్ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ జవాన్లు, వాటర్ సప్లై, విద్యుత్ శాఖ సిబ్బందితో మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆయా విభాగాల ద్వారా చేపట్టాల్సిన పనులపై వారికి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పట్టణంలోని రోడ్ల మరమ్మతు పనులు చేపట్టి గుంతలను పూడ్చాలన్నారు. రోడ్లపై పశువుల సంచారాన్ని కట్టడి చేయాలన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధవహించాలన్నారు. నిమజ్జనం రోజున శోభయాత్ర తిలకించేందుకు వచ్చే ప్రజల కోసం తాత్కాలికంగా టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. విగ్రహాలను నిమజ్జనం చేసే పెన్‌గంగ నది వద్ద ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఇందులో డీఈలు తిరుపతి, కార్తీక్, ఎస్‌ఐలు నరేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గురుభ్యో నమః



- బోధనలో మెరిసిన మాస్టార్లు
- రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక
- ఉమ్మడి జిల్లా నుంచి ఆరుగురు
- నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

ఉపాధ్యాయుడు.. అజ్ఞానమనే అంధకారాన్ని పారద్రోలి విజ్ఞానమనే వెలుగును ప్రసాదిస్తాడు. తాను వెలుగుతూ ప్రపంచాన్ని వెలిగిస్తాడు. అక్షర పూదోటలో తోటమాలిగా.. విద్యార్థి జీవితానికి మార్గదర్శిగా నిలుస్తాడు. అలాంటి వృత్తినే దైవంగా భావిస్తూ బోధనలో తమకంటూ ప్రత్యేకత చాటుతున్నారు ఉమ్మడి జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు. చదువు చెప్పడమే కాదు.. సమాజంలో ఎలా బతకాలని నేర్పుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. బడిబాగు కోసం సైతం తమవంతు కృషి చేస్తున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైన పలువురు మాస్టార్లపై ప్రత్యేక కథనం.

పర్యావరణ ప్రేమికుడు.. నర్సయ్య



కంటె నర్సయ్య

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కంటె నర్సయ్య ఎంపికయ్యారు. బోధనకే పరిమితం కాకుండా ఈయన పర్యావరణ ప్రేమికుడిగానూ ప్రత్యేక గుర్తింపు పొందారు. 1984 జనవరి 23న ఉపాధ్యాయ వృత్తిలోకి అరంగేట్రం చేశారు. బేల మండల బాలికల ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధుల్లో చేరారు. ఆ తర్వాత బదిలీ, పదోన్నతుల ద్వారా జిల్లాలోని పలు పాఠశాలల్లో పని చేశారు. ప్రస్తుతం అంకోలి పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. నాలుగు దశాబ్దాలకు పైబడి ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ తనకంటూ ప్రత్యేకత చాటారు. తొలుత ఎస్జీటీగా తర్వాత ఎస్‌ఏ బయోసైన్స్ ఉపాధ్యాయుడిగా, అనంతరం పీజీ హెచ్‌ఎంగా పదోన్నతి పొందారు. ఇన్‌చార్జి ఎంఈవోగా, జిల్లా విద్యాశాఖలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్‌గా, సెక్టోరియల్ అధికారిగానూ విధులు నిర్వహించారు.

ఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్‌గా..

ఈయన 20 ఏళ్లుగా నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్లాస్టిక్ నిరోధంతో పాటు ఓజోన్ పొర అంశంపై జిల్లాలోని ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించేందుకు రాఖీ బంధన్ వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు. 2018లో అంకోలి పాఠశాలలో పనిచేసే సమయంలో హరితమిత్ర అవార్డు లభించింది.

రిసోర్స్ పర్సన్‌గానూ..

ఇక విద్యాశాఖలో క్యూఐపీ, ఎల్‌ఈపీ, క్లాప్స్, ఎఫ్‌ఎల్‌ఎస్, ఉన్నతి, లక్ష్య శిక్షణ కార్యక్రమాలకు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించి ఉపాధ్యాయులకు శిక్షణ కల్పించారు. స్కూల్ కాంప్లెక్స్‌ను ఏవిధంగా నిర్వహించాలనే దానిపై మాడ్యూల్ తయారు చేశారు. 41ఏళ్ల పాటు ఎంతో మంది విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దారు. 2004లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. వచ్చే ఏడాది ఆగస్టులో ఉద్యోగ విరమణ పొందనున్నారు. కాగా గురువారం హైదరాబాద్‌లో సీఎం చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోనున్నారు.

అవార్డుల గురువు.. సురేందర్



శనిగరపు సురేందర్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం అన్నారం జెడ్పీహెచ్‌ఎస్‌లో భౌతిక, రసాయన శాస్త్రాలు బోధిస్తున్న స్కూల్ అసిస్టెంట్ శనిగరపు సురేందర్ విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. తన సబ్జెక్టును శాస్త్రీయ దృక్పథంతో బోధించడమే కాకుండా, ఏటా స్కూళ్లలో నిర్వహించే అనేక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు. ఇన్‌స్పైర్ మనక్, జవహర్‌లాల్ నెహ్రూ సైన్స్ అండ్ మాథమెటిక్స్ ఎన్విరాన్‌మెంటు ఎగ్జిబిషన్స్, ఇంటింటా ఇన్నోవేటర్ అవార్డులు, జాతీయ స్థాయిలో రెండు, రాష్ట్ర స్థాయిలో ఆరు, జిల్లా స్థాయిలో 34సార్లు పాల్గొని అవార్డులు గెలుచుకున్నారు. గత ఏడాది నవంబర్‌లో ఢిల్లీలో నిర్వహిం చిన జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మనక్‌లో తెలంగాణ నుంచి రెండు ఎంపిక కాగా.. దేశంలోనే 60వ స్థానంలో నిలిచారు. తన విద్యార్థి మణిప్రసాద్‌కు గైడ్‌గా ఉంటూ రైతులకు కల్లాల్లో ధాన్యం వర్షం, పశువుల నుంచి రక్షించేందుకు 'గ్రేన్ ప్రొటెక్టడ్ ఫ్రం, రెయిన్ అండ్ ఎనిమిల్స్' రూపొందించిన ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో అవార్డు లభించింది. అంతకుముందు విద్యుత్ లేకుండానే నీటిని ఎత్తిపోసేలా చేసిన ప్రయోగానికి జాతీయ స్థాయిలో అవార్డు దక్కింది. విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని టీచర్ సురేందర్ అంటున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసింది.

విశిష్ట కృషికి పురస్కారం



కూన రమేశ్

సారంగపూర్: విద్యారంగంలో తాను చేసిన కృషి రాష్ట్రస్థాయి అవార్డు సాధించి పెట్టింది. మండలంలోని చించోలి (బి) ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కూన రమేశ్ తాను పనిచేసిన ప్రతీ పాఠశాలలోనూ తనదైన శైలిలో పెను మార్పులు తీసుకొచ్చాడు. మూతబడే స్థాయిలో ఉన్న పాఠశాలను మనుగడలోకి తెప్పించారు. దాతల సహకారం, అందుబాటులో ఉన్న వనరులతో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు ధీటుగా తీర్చిదిద్దారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం తేజాపూర్ పాఠశాలలో పనిచేస్తుండగా ఎస్‌ఈఆర్టీ తెలంగాణ, హైదరాబాద్ ప్రచురించిన రైస్ అండ్ షైన్ పుస్తకంలో చోటు సంపాదించారు. ఇదే పాఠశాలలో కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేసి పండ్లు, పూలమొక్కలు, ఆకుకూరలు, కూరగాయలు పండించి పిల్లలకు పౌష్టికా హారం అందించే ఏర్పాట్లు చేశారు. 2024లో టెక్ మహీంద్రా, సైన్స్ అకాడమీ హైదరాబాద్ వారి సహాయతా ట్రస్ట్ సహకారంతో పాఠశాలను అభివృద్ధి పరిచి రాష్ట్రస్థాయి సెరిమణి అవార్డును సైతం కైవసం చేసుకున్నారు. 200 మంది ఉపాధ్యాయులకు వర్క్‌షాప్ నిర్వహించి సైన్స్ కిట్లు పంపిణీ చేశారు. కేరళలోని త్రిశూల్‌లో నిర్వహించిన సౌత్‌ఇండియా సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొని రాష్ట్రం తరఫున ద్వితీయ బహుమతి సాధించారు. మడికొండలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో టీచర్ టీఎల్‌ఈలో ప్రతిభ చాటారు. నిర్మల్‌రూరల్ మండలంలోని జాఫ్రాపూర్‌లో 2009లోనే డిజిటల్ తరగతి గదిని ఏర్పాటు చేశారు. ఇలా తాను అందించిన సేవలను గుర్తించిన ప్రభుత్వం రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక చేసినట్లు ఉపాధ్యాయుడు కూన రమేశ్ పేర్కొన్నారు.

బోధనలో ప్రత్యేక శైలి..



దాసరి శంకర్, ఎంపీపీఎస్, పీచర

లక్ష్మణచాంద: విద్యారంగంలో విశేష కృషి చేసిన నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని పీచర ఎంపీపీఎస్‌లో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న దాసరి శంకర్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. జిల్లాలో బడి మానేసిన పిల్లల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి వారికి చదువు విలువ తెలిసేలా అవగాహన కల్పించారు. వారిలో చైతన్యం నింపి ఎంతోమంది విద్యార్థులను బడికి పంపేలా చేశారు. ప్రాథమిక పాఠశాలస్థాయిలో పర్యావరణ విద్యపై జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో జిల్లా రిసోర్స్ పర్సన్‌గా విధులు నిర్వర్తించారు. ఈవీఎస్ పరీక్ష పత్రం రూపకల్పనలో పాల్గొన్నారు. గురుకుల ప్రవేశపరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి స్టడీ మెటీరియల్ అందించారు. విద్యార్థులకు విద్యతో పాటు విస్తారాకులు కుట్టడంలో శిక్షణ ఇవ్వడం వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. మనఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా వందశాతం పనులు పూర్తిచేయించి పాఠశాలను జిల్లాస్థాయిలో ముందంజలో ఉంచారు. గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో రూ.50 వేలతో పాఠశాలకు అందమైన రంగులు వేయించడంతో పాటు రూ.90 వేలతో తాగునీటి వసతి కల్పించారు. పాఠశాలలో విద్యార్థులచేత 180 మొక్కలు నాటించి వాటిని సంరక్షించారు. విద్యార్థులను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి ప్రత్యక్షంగా పాఠాలు బోధించారు. తన సేవలను గుర్తించిన ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందని ఉపాధ్యాయుడు శంకర్ పేర్కొన్నారు. తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. విద్యార్థుల శ్రేయస్సుకోసం రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తానన్నారు.

శ్రీనివాస్ సార్ అంటేనే నమ్మకం



జన్నారం: ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావిస్తూ సేవలందిస్తుంటాడు. ఆ సార్‌ను విద్యార్థులు కూడా గురుబ్రహ్మగా ఆరాధిస్తూ పాఠశాలకు హాజరవుతుంటారు. ఆయనపై ఉన్న నమ్మకంతో బదిలీపై వెళ్లిన పాఠశాలలోనే చేరిపోయారు. జన్నారం మండలం అక్కపెల్లిగూడ ప్రధానోపాధ్యాయుడు జాజాల శ్రీనివాస్ 2012లో ఇదే మండలంలోని పొన్కల్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా చేరారు. మొదట్లో 27మందికి విద్యాబోధన చేశారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో తోటి ఉపాధ్యాయులతో కలిసి ఉత్తమమైన బోధనతో ఫలితాలు రాబట్టారు. గురుకుల, నవోదయ వంటి పోటీ పరీక్షల్లో విద్యార్థుల ఎంపికకు కృషి చేశా రు. దీంతో అనతికాలంలోనే పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 252కు పెంచారు. ప్రైవేటు పాఠశాలకు దీటుగా జూన్ చివరి వారం నుంచే నో అడ్మిషన్ బోర్డు ఏర్పాటు చేసే స్థాయికి తీసుకొచ్చారు. ఇటీవల శ్రీని వాస్ అక్కపెల్లిగూడ ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. ఈయన చేరే వరకు బడిలో 11మంది విద్యార్థులు ఉండేవారు. బదిలీ విష యం తెలిసి విద్యార్థులు సార్ వెంట వెళ్తామని నిర్ణయించుకోవడంతో ఏకంగా 141మందిని తల్లిదండ్రులు అదే బడిలో చేర్పించారు. టీజీ పల్లె, దేవునిగూడ, కామన్‌పల్లి, కిష్టాపూర్, జన్నా రం, జువ్విగూడ గ్రామాల నుంచి వాహనాల్లో శ్రీనివాస్‌పై ఉన్న నమ్మకంతో వెళ్తున్నారు. శ్రీని వాస్ సేవలకు గాను ప్రభుత్వం రాష్ట్రస్థాయి ఉత్త మ ఉపాధ్యాయుడి అవార్డుకు ఎంపిక చేసింది.

విధులు సక్రమంగా నిర్వర్తించాను

ఉపాధ్యాయ వృత్తిలో భాగంగా నా విధులు సక్రమంగా నిర్వర్తించాను. విద్యార్థుల్లో విద్యాపరంగా చైతన్యం తీసుకురావడానికి కృషి చేశాను. నాతోటి ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులను ఉన్నత స్థానానికి చేరుకునేలా చేశాను. నా విధులను సక్రమంగా నిర్వర్తించడం వల్లనే గుర్తింపు లభించినందుకు ఆనందంగా ఉంది.

– జాజాల శ్రీనివాస్,హెచ్‌ఎం, అక్కపెల్లిగూడ

దాతల సహకారంతో బడి అభివృద్ధి



పల్సి శ్రీనివాస్, ఎస్జీటీ, దేగాం

భైంసా: మండలంలోని దేగాం పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న పల్సి శ్రీనివాస్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. 2002 అక్టోబర్ 17న ఈయన ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టాడు. కుభీర్ పాఠశాలలో టీచర్‌గా అరంగేట్రం చేశాడు. ఆ తర్వాత భైంసా మండలంలోని కుంబి, పట్టణంలోని ఎంపీపీఎస్ పిప్రికాలనీలో విధులు నిర్వర్తించాడు. ఐదేళ్ల క్రితం పిప్రికాలనీలోని పాఠశాలకు బదిలీపై వచ్చిన సమయంలో అక్కడ 12 మంది విద్యార్థులే ఉన్నారు. ఈయన చొరవ చూపి ఇంగ్లిషు మీడియం బోధన అందుబాటులోకి తీసుకురావడంతో విద్యార్థుల సంఖ్య ఏకంగా 252 మందికి చేరింది. తరగతి గదులు, ఇతర సామగ్రి కోసం అప్పటి పాఠశాల కమిటీ సభ్యులు, పోషకులతో మాట్లాడి భైంసా పట్టణానికి చెందిన పలువురు దాతలను కలిశారు. వారి సహకారంతో ఏటా రూ.1.50లక్షల మేర జమచేసి పాఠశాలకు కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేశారు. డిజిటల్ పాఠాల బోధనను అందుబాటులోకి తెచ్చారు. ఇతర వసతులు సైతం కల్పించారు. ఇటీవలే ఈయన బదిలీపై దేగాం పాఠశాలకు వెళ్లారు.

మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించాలి



అవగాహన పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: గణేశ్ మండపాల నిర్వాహకులు మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కలెక్టర్ రాజర్షి అన్నారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణేశ్ విగ్రహాల అవశ్యకతపై ముద్రించిన పోస్టర్‌ను తన క్యాంపు కార్యాలయంలో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. దాన్ని గుర్తించి మట్టి విగ్రహాలకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. కాలుష్య నియంత్రణ మండలి ద్వారా మట్టి వినాయక విగ్రహాలను భక్తులకు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఇందులో పర్యావరణ ఇంజినీర్ లక్ష్మణ్ ప్రసాద్, ఉద్యోగులు, సిబ్బంది తదితరులున్నారు.

పోషణ మాసం పోస్టర్ విడుదల

కైలాస్‌నగర్: పోషణ్ అభియాన్‌లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 1నుంచి 30వరకు నిర్వహించనున్న పోషణ మాసం ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ రాజర్షిషా తన క్యాంపు కార్యాలయంలో బుధవారం విడుదల చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంతో పాటు పోషకాహారం ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇందులో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, జిల్లా సంక్షేమాధికారి సబిత, సీడీపీవోలు మిల్కా, వనజ తదితరులు పాల్గొన్నారు.

స్వార్థ రాజకీయాల కోసమే ఆరోపణలు

- బహిరంగ చర్చకు రామన్న సిద్ధమా..
- ఎమ్మెల్యే పాయల్ శంకర్ సవాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: మాజీ మంత్రి జోగు రామన్న స్వార్థ రాజకీయాల కోసమే అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో నష్టపోయిన రైతాంగాన్ని పరామర్శించేందుకు మంత్రి శ్రీధర్‌బాబు విచ్చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో బాధిత రైతుల వివరాలు, పంట నష్టం వివరించే బాధ్యత ఎమ్మెల్యేగా తనపై ఉందని తెలిపారు. అయితే మంత్రిగా, ఎమ్మెల్యేగా విధులు నిర్వర్తించిన జోగు రామన్న కనీస అవగాహన లేకుండా తనను మంత్రితోపాటు పర్యటించానని వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ జరిగితే ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభ్యమవుతాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని మంత్రి దృష్టికి విషయాన్ని తీసుకెళ్తే ఆయన సీసీఐ పరిశ్రమను సందర్శించారన్నారు. అయితే ఈ విషయాన్ని రామన్న రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. ఏ విషయంపైన అయినా తాను బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఇందుకు జోగు రామన్న ముందుకు రావాలన్నారు. కొరటా–చనాఖా ప్రాజెక్ట్ నిర్మాణ విషయంలో మాజీ మంత్రి కమీషన్లు తీసుకున్నారని ఆయన ఆరోపించారు. ఇందులో నాయకులు అంకత్ రమేష్, మయూర్ చంద్ర, లాలామున్నా, జోగు రవి, తదితరులు ఉన్నారు.

రిమ్స్‌లో ఇక 'ప్లేట్‌లెట్స్' సేవలు

- త్వరలో అందుబాటులోకి మిషన్
- డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. చిన్న, పెద్ద తేడా లేకుండా మంచాన బారిన పడే వారి సంఖ్య క్రమేణ పెరుగుతుంది. ప్రైవేట్ ఆసుపత్రులతో పాటు రిమ్స్ జ్వరపీడితులతో కిటకిటలాడుతోంది. డెంగీ బారిన పడ్డ వారిలో ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గిపోతుంది. సరైన సమయంలో ప్లేట్‌లెట్స్ లభించక గతంలో మరణాలు సైతం సంభవించాయి. తాజాగా డెంగీ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ (ఎస్‌డీపీ)సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇది వరకే ఈ మిషన్ రిమ్స్‌లో ఉన్నప్పటికీ అందుకు సంబంధించిన అనుమతులు రాలేదు. టెక్నీషియన్లు లేకపోవడంతో తెచ్చిన మిషన్‌ను సైతం ఇన్‌స్టలేషన్ చేయలేకపోయారు. ఇటీవల ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో దాని సేవలు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. ప్రస్తుతం బ్లడ్‌బ్యాంక్‌లో ర్యాండమ్ డోనర్ ప్లేట్‌లెట్స్ మిషన్ ఉన్నప్పటికీ ప్లేట్‌లేట్స్ సంఖ్య తక్కువగా పెరుగుతోంది. దీంతో బాధితులు కోలుకునేందుకు సమయం పడుతుంది. అయితే సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ మిషన్‌తో ఒక్కసారి 10వేల నుంచి 50వేల వరకు పెరిగే అవకాశముందని వైద్యులు చెబుతున్నారు. అయితే రోగిలో 20వేల నుంచి 30వేలకు ప్లేట్‌లెట్స్ పడిపోయినప్పుడు శరీరంపై దద్దుర్లు, చిగుర్ల నుంచి రక్తం రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ సమయంలో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్‌ను ఎక్కిస్తారు. ఇది వరకు నిర్మల్, నిజామాబాద్ వంటి ఇతర ప్రాంతాల నుంచి సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్‌ను తీసుకువచ్చి రోగికి ఎక్కిచ్చేవారు. ఒక్కో బ్యాగు ఖరీదు రూ.8వేల నుంచి రూ.10వేల వరకు ఉండేది. దీంతో దాన్ని కొనుగోలు చేయడం, రవాణా పరంగా తీవ్ర వ్యయ, ప్రయాసాలకు గురవ్వాల్సిన పరిస్థితి ఉండేది. తాజాగా రిమ్స్‌లో ఈ ఎస్‌డీపీ సేవలు అందుబాటులోకి రానుండటంతో డెంగీ బాధితులకు ఊరట లభించనుంది.

కొవ్వొత్తుల ప్రదర్శన



కోల్‌కతాలో వైద్య విద్యార్థిని దారుణ హత్యను నిరసిస్తూ రిమ్స్‌లో జూనియర్ డాక్టర్లు బుధవారం కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టి నివాళులర్పించారు. కార్యక్రమంలో జూడాల సంఘం అధ్యక్షుడు సందీప్‌చారి, జూడాలు పాల్గొన్నారు.

– ఆదిలాబాద్‌టౌన్

పోలీసులు ప్రజలతో మమేకం కావాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

బోథ్: పోలీసులు ప్రజలతో మమేకం కావాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. మండలకేంద్రంలోని బోథ్ సర్కిల్, పోలీస్‌స్టేషన్‌ను బుధ వా రం ఆయన తనిఖీ చేశారు. ముందుగా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయని సిబ్బంది ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట సీఐ రమేశ్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

మంచి మాస్టార్లు



- విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు
- చదువుతోపాటు అన్ని రంగాల్లో చేయూత
- నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

తల్లిదండ్రుల తర్వాత అత్యంత పూజనీయంగా భావించేది గురువులనే. 'ఆచార్య దేవో భవ' అంటూ విద్యాబుద్ధులు నేర్పిన గురువులను కీర్తిస్తాం. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులతోపాటు గురువుల పాత్ర కీలకం. విద్యార్థుల తెలివితేటలు, ఆలోచనలు, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేది వారే. చదువు మీద శ్రద్ధ తగ్గినట్టనిపించినా, మనసు పక్కదారి పట్టినా గుర్తించి సరైన దారిలో నడిపిస్తారు. అందుకే గురువును మించిన దైవం లేదంటారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని ఏటా సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా పలువురు ఉత్తమ ఉపాధ్యాయులపై కథనం..

ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో కథల పుస్తకం..



విద్యార్థినులు రాసిన కథల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న డీఈవో రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయుడు పోతన్న (ఫైల్)

నిర్మల్‌రూరల్: సోన్ మండలం వెల్మల్ బొప్పారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు కొండూరి పోతన్న విద్యార్థులకు అన్ని రంగాల్లో వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఆయన ఇచ్చిన ప్రోత్సాహంతో గత ఏడాది పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులు ఏకంగా కథల పుస్తకం రాశారంటే అతిశయోక్తి కాదు. పాఠశాలకు చెందిన 19 మంది విద్యార్థినులు కలిసి దాదాపు 20 కథలను రాసి, వాటిని పుస్తక రూపంలో ప్రచురించారు. చదువుతోపాటు విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండాలని వారిని ప్రోత్సహిస్తున్నారు. పోతన్న సేవలను గుర్తించి 2022లో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, ఉత్తర వాహిని పురస్కారం, 2021లో ఉగాది పురస్కారం, 2020లో ఝాన్సీ లక్ష్మీబాయి పురస్కారం, రాజశ్రీ పురస్కారం.. ఇలా పదుల సంఖ్యలో పురస్కారాలు ఆయన్ను వరించాయి.

కేవీ నుంచి ప్రభుత్వ బడికి..



పాఠాలు బోధిస్తున్న జాకీర్‌హుస్సేన్

మంచిర్యాలఅర్బన్: కేంద్రీయ విద్యాలయంలో సీటు రావడమే ఎంతో కష్టం. అలాంటి పాఠశాల నుంచి తాను విధులు నిర్వహించే ప్రభుత్వ పాఠశాలలో తన కూతురును చేర్పించి ఆదర్శంగా నిలిచారు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు జాకీర్‌హుస్సేన్. మంచిర్యాలకు చెందిన జాకీర్‌హుస్సేన్ కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న తన కూతురు మిస్బా హుస్సేన్‌ను తాను ఇటీవల బదిలీపై వెళ్లిన నెన్నెల మండలంలోని ఆవడం ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతిలో చేర్పించారు. 30 కిలోమీటర్ల దూరంలో ఉండే పాఠశాలకు రోజూ తన వెంట తీసుకెళ్తున్నారు. ప్రైవేట్ పాఠశాల కంటే ఉత్తమ విద్యాబోధన చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలని ఆయన చెబుతున్నారు.

రచయితలుగా తీర్చిదిద్దుతూ..



పోరెడ్డి అశోక్, హెచ్‌ఎం, లక్ష్మీపూర్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులకు చదవడం అలవాటు చేయడంతో పాటు వారిని కథలు రాసేలా ప్రోత్సహిస్తున్నారు ప్రధానోపాధ్యాయుడు పోరెడ్డి అశోక్. చదువుతోనే భవిష్యత్తు ఉందని విద్యార్థులకు అర్థమయ్యేలా ఆయన కృషి చేస్తున్నారు. కూరలోని పాఠశాలలో దాతల ద్వారా రూ.40 వేలతో 700 పుస్తకాలు కొనుగోలు చేసి లైబ్రరీ ఏర్పాటు చేశారు. పాఠశాలలోనే కాకుండా ఆదిలాబాద్ పట్టణం శాంతినగర్ కాలనీలోని తన ఇంటి వద్ద రూ. 30వేలతో 600 పుస్తకాలు కొనుగోలు చేసి కాలనీ పిల్లల కోసం లైబ్రరీ నిర్వహిస్తున్నారు. ప్రతీరోజు సాయంత్రం 6 గంటలకు విద్యార్థులు కథల పుస్తకాలు చదివేలా చూస్తున్నారు. వేసవి సెలవుల్లో సైతం సమ్మర్ లైబ్రరీ నిర్వహించారు. ఆయన ప్రోత్సాహంతో జెడ్పీఎస్ఎస్ పాఠశాలకు చెందిన శ్రీజ అనే విద్యార్థిని కథలు రాసి యంగ్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మన ఊరు -మన చెట్టు అనే పుస్తకంలో కూర గ్రామానికి చెందిన 10 మంది విద్యార్థులు కథలు రాశారు. లక్ష్మీపూర్ పాఠశాలకు చెందిన హరిఓం అనే విద్యార్థి తెలంగాణ సారసత్వ పరిషత్ పుస్తకంలో రాసిన కథ ఉత్తమ కథగా ఎంపికైంది. పండరికీర్తి అనే విద్యార్థి జన విజ్ఞాన వేదిక ద్వారా రూపొందించిన చెక్‌ముఖి, బాలబట పుస్తకాల్లో కథలు రాశారు.

విద్యార్థులకు వినూత్న బోధన



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న రామగిరి దిలీప్‌కుమార్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రామగిరి దిలీప్‌కుమార్.. ఎస్జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్) బోధనలో తనదైన ముద్ర వేస్తున్నారు. గత 13ఏళ్లుగా మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట పట్టణం క్లబ్ రోడ్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బోధించారు. గత జూలైలో ముల్కల్లగూడ స్కూల్‌కు బదిలీ అయ్యారు. విద్యార్థులూ మూకుమ్మడిగా టీసీ తీసుకుని సారు వెంటే మేము అంటూ కొత్త బడిలో చేరిపోయారు. ఏకంగా 105మంది విద్యార్థులు వెళ్లారంటే సారు బోధన తీరును అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత స్కూల్ కంటే దూరమైనా విద్యాబోధన నచ్చి విద్యార్థులు ఆటోలో వెళ్లి వస్తున్నారు. దిలీప్‌కుమార్ మొదట కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం కోపుగూడ, మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం కొమ్ముగూడెంలో పని చేశారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో చిన్నారులు బడికి తక్కువగా వచ్చేవారు. దీంతో గ్రామాల్లో పర్యటించి విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంచేలా చేశారు. ఆర్థికసాయం, స్కూల్ సౌకర్యాల పెంపునకు కృషి చేశారు. కనీస సౌకర్యాలు లేని చోట గిరిజన విద్యార్థులకు చదువు చెప్పారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఇటీవల రూ.4లక్షల వ్యయంతో ప్రొజెక్టర్లు తెచ్చి సర్కారు స్కూల్‌లోనూ డిజిటల్ బోధన చేస్తున్నారు. నిరుపేద విద్యార్థులకు చదువు నేర్పాలనే తపనతో స్కూల్‌కు గంట ముందే వెళ్లి గంట ఆలస్యంగా వస్తుంటారు. 4వ, 5వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల ద్వారా గురుకుల, నవోదయ ప్రవేశ పరీక్షల్లో సీటు వచ్చేలా చేశారు. టీచర్‌పై తల్లిదండ్రులకు నమ్మకం ఏర్పడి 11మంది విద్యార్థులు ఉన్న సంఖ్య ఆయన రాకతో ప్రస్తుతం 250కి చేరింది.

ఎంతో కొంత మేలు చేయాలని..



మారుమూల ప్రాంతాల్లో ఇప్పటికీ చాలామంది నిరుపేద విద్యార్థులు ఉన్నారు. వారికి ఎంతో కొంత మేలు చేస్తే చదువులో రాణిస్తారు. బోధన వృత్తిలో ఉన్నప్పుడు పేద విద్యార్థులకు ఏదైనా చేయాలనేదే నా చిన్న ప్రయత్నం.

–రామగిరి దిలీప్‌కుమార్, ఎస్జీటీ, గ్రామం: ముల్కల్లగూడ, మం: లక్సెట్టిపేట

కృత్యధారణ బోధన..



మెస్రం కృష్ణ, దుప్పపూర్, నార్నూర్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయడంలో మెస్రం కృష్ణను మించిన వారు లేరు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌తో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు. ఆటపాటలతో విద్యాబోధన చేస్తూ ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇదివరకు ఉమ్మడి జిల్లాలోని తిర్యాణి మండలం బోర్‌గాం, జైనూర్ మండలంలోని దబోలిలో పని చేశారు. ప్రస్తుతం నార్నూర్ మండలంలోని దుప్పపూర్‌లో విద్యాబోధన చేస్తున్నారు. బోర్‌గాం, ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలోనూ ఏకోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. విధుల్లో ఏనాడు నిర్లక్ష్యం చేయకుండా, అత్యవసర పరిస్థితులైతే తప్పా సెలవులు తీసుకోరు.

పాఠశాలలో పచ్చదనం..



గంపల ప్రభాకర్, ఉపాధ్యాయుడు



గుబిడిపల్లి పాఠశాల ఆవరణలో పచ్చదనం

తాంసి: భీంపూర్ మండలం గుబిడిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఉపాధ్యాయుడు ప్రభాకర్ హరితవనంలా మార్చారు. సరైన రోడ్డు సౌకర్యం లేక అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న గుబిడిపల్లి పాఠశాల అధ్వానంగా ఉండేది. ఆరేళ్ల క్రితం పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుడు ప్రభాకర్, పాఠశాల హెచ్‌ఎం తిరుపతితో కలిసి పాఠశాలలో పచ్చదనం వెల్లివిరిసేలా కృషి చేశారు. గ్రామస్తులకు పాఠశాల, విద్య ప్రాముఖ్యత తెలియజేసి ప్రతీ విద్యార్థి పాఠశాలకు వచ్చేలా అవగాహన కల్పించారు. పాఠశాల చుట్టూ సొంత ఖర్చుతో కంచె ఏర్పాటు చేయడంతో పాటు ఆవరణలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. విద్యార్థులకు పోషకాలతో కూడిన భోజనం అందించేందుకు కిచెన్‌గార్డెన్ ఏర్పాటు చేసి పండ్ల మొక్కలతో పాటు కూరగాయలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఆహ్లాదకర వాతావరణంలో 40మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థుల చదువుకు విశేషంగా కృషి చేస్తున్న ప్రభాకర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు.

సోదరుడితో కలిసి చేయూత..



మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాలలో బ్యాగులు అందజేస్తున్న జ్యోతి, రవికుమార్ (ఫైల్)

మంచిర్యాలఅర్బన్: తాను పని చేస్తున్న పాఠశాలలోనే కాకుండా ఇతర పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తన వంతు సాయం అందిస్తున్నారు మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు చట్ల జ్యోతి. కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఉండేలా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బడుగు, బలహీన, నిరుపేద వర్గాల పిల్లలకు షూ(బూట్లు), టై, బెల్ట్, బ్యాగులు, నోట్ పుస్తకాలు అందజేస్తున్నారు. 2005లో మందమర్రి బాలుర హైస్కూల్లో ఐదుగురు పిల్లలను దత్తత తీసుకొని చదివించారు. అనంతరం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం కమనా పాఠశాలకు బదిలీపై వెళ్లారు. పాఠశాలలో పరిస్థితులను చూసి ఆమె చలించిపోయారు. పాఠశాలకు ఏదైనా చేయాలనే ఆలోచనతో జర్మనీలో ఉన్న సోదరుడు రవికుమార్‌కు విషయం తెలిపారు. అతని సహకారంతో కామనా పాఠశాలను దత్తత తీసుకొని రూ. 2లక్షల విలువ చేసే లైబ్రరీ, బోర్‌వెల్, రూ. 8లక్షల వ్యయంతో డైనింగ్ హాల్ నిర్మించారు. తాగునీటి కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. అనంతరం తాను పనిచేసిన చాకెపల్లిలో పిల్లలకు పుస్తకాలు, బ్యాగులు, స్టేషనరీ అందించారు. గతేడాది అక్టోబర్‌లో మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాలకు బదిలీ కాగా 365 మంది విద్యార్థులకు షూ, టై, బెల్ట్, బ్యాగులు, స్టేషనరీ పంపిణీ చేశారు. మినరల్ ప్లాంట్ ఏర్పాటు చేసి శుద్ధ జలం అందిస్తున్నారు. 100 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు సైతం పంపిణీ చేశారు. తన సోదరుడి సహకారంతో వివిధ పాఠశాలల్లోని విద్యార్థులకు కావాల్సిన సామగ్రి అందజేస్తున్నారు.

మూత'బడి'ని తెరిపించి..



పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు వసంత

దండేపల్లి: సాధారణ ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా 2018లో జునగరి వసంత మండలంలోని లింగాపూర్ జీపీ పరిధి దుబ్బగూడ ప్రాథమిక పాఠశాలకు వచ్చారు. అయితే విద్యార్థులు లేరని ఆ పాఠశాలను మూసేశారు. దీంతో మండల విద్యాశాఖ అధికారులు ఆమెను మరో పాఠశాలకు డెప్యూటేషన్ ఇచ్చారు. ఇందుకు ఒప్పుకోని వసంత మూతపడిన పాఠశాలను తెరిపిస్తానని చెప్పి, ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. వారిని ఒప్పించి 11 మందిని బడిలో చేర్పించారు. విద్యార్థులకు చక్కటి విద్యాబోధన చేయడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉపాధ్యాయురాలిపై నమ్మకం పెరిగింది. దీంతో గ్రామంలోని పిల్లలందరిని ప్రైవేటుకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలకే పంపిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 18కి చేరింది. కాగా ఉపాధ్యాయురాలు పేద విద్యార్థులకు సొంత ఖర్చులతో నోట్‌బుక్కులు, పెన్నులు సైతం అందిస్తున్నారు.

ఆడపిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి..



రాథోడ్ మీరాబాయి, ఎస్జీటీ, తంతోలి

ఆదిలాబాద్‌టౌన్: 2002 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన రాథోడ్ మీరాబాయి ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని మారుమూల గ్రామం తిప్పా, లోకారిలో పనిచేశారు. ప్రస్తుతం తంతోలి యూపీఎస్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఆడపిల్లల చదువుపైనే ఆమె ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. బాలికల డ్రాప్‌అవుట్ లేకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడి మానేసిన వారిని తిరిగి బడిలో చేర్పించడంలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చుతున్నారు. లోకారిలో పనిచేసేటప్పుడు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులను ఒప్పించి సర్కారు బడిలో చేర్పించారు. పాఠశాల ఆవరణలో బడితోట ఏర్పాటు చేసి అక్కడ పండిన కూరగాయలు, ఆకుకూరలను విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వినియోగిస్తున్నారు.

వందశాతం రిజల్ట్ ..



రాములు, యాపల్‌గూడ

ఆదిలాబాద్‌టౌన్: చదువుతోనే భవిష్యత్తు అని విద్యార్థులను ప్రోత్సహిస్తూ సాంఘిక శాస్త్రం బోధిస్తున్నారు ఉపాధ్యాయుడు రాములు. పాఠశాలలో పదో తరగతిలో కొన్నేళ్లుగా వంద శాతం రిజల్ట్ సాధించడంలో ఆయన కృషి ఎంతో ఉంది. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చుతున్నారు. బడికిరాని పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి బడికి పంపేలా చూస్తున్నారు. తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి పిల్లల భవిష్యత్తుపై వివరిస్తున్నారు. వినూత్న రీతిలో విద్యాబోధన చేస్తూ ముందుకు సాగుతున్నారు. పదో తరగతి చదివే విద్యార్థులకు పరీక్షల సమయంలో రాత్రి వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న భోజనం తర్వాత తన సబ్జెక్ట్ కాకుండా ఇతర సబ్జెక్ట్‌లల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు.

నిక్కచ్చిగా విధులు..



యు.పద్మజ, హెచ్‌ఎం, గిమ్మ

ఆదిలాబాద్‌టౌన్: చదువుతో పాటు విద్యార్థులకు క్రమశిక్షణ ముఖ్యమని చెబుతారు గిమ్మ పాఠశాల హెచ్‌ఎం పద్మజ. సమయపాలన పాటించడంతో పాటు విధుల్లో నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారు. ఏ విషయంలోనూ తగ్గకుండా విద్యార్థులను అన్ని రంగాల్లో ముందుంచేలా చూస్తున్నారు. బరంపూర్ పాఠశాలలో పనిచేసిన సమయంలో 200 మంది వరకు విద్యార్థుల సంఖ్య పెరగడంలో ఎంతో కృషి చేశారు. కళోత్సవ పోటీల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి సాధించేలా కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుతం గిమ్మ పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ పెంపునకు చర్యలు చేపడుతున్నారు.

దడువాయి కార్యవర్గం ఎన్నిక

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం ఉమ్మడి జిల్లా దడువాయి (వేమన్) యూనియన్ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు నాయిని సుదర్శన్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఏనుగు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎలాల్ వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా అనిల్, సహాయ కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, ఆర్గనైజర్ సెక్రెటరీగా ప్రశాంత్‌కుమార్, గౌరవ సలహాదారులుగా భూమన్న, కార్యవర్గసభ్యులుగా ఇజాజ్‌హైమద్, వెంకటేశ్, తులసీరాం, జాదవ్‌భీంరావు, అనిల్, అలీఖాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

8న జిల్లాస్థాయి చెస్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8న ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. అండర్ -11 బాలబాలికలకు పోటీలు ఉంటాయని, 2013 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. అర్హత గల క్రీడాకారులు ఈనెల 7వ తేదీన సాయంత్రం ఐదు గంటల లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రం, చెస్‌బోర్డ్ వెంట తీసుకురావాలని, వివరాలకు 98487 36476 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

దారితప్పిన మేకల కాపరి ఆచూకీ లభ్యం



మేకల కాపరితో ఎస్సై మనోహర్, సిబ్బంది

ఉట్నూర్‌రూరల్: అడవిలో దారితప్పిన మేకల కాపరి ఆచూకీని పోలీసులు బుధవారం గుర్తించారు. మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన దత్త మంగళవారం మేకలను తీసుకొని బాబాపూర్ శివారులోని అటవీ ప్రాంతానికి వెళ్లాడు. భారీ వర్షం పడడంతో అడవిలో దారితప్పిపోయాడు. సాయంత్రమైనా దత్త ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు పోలీసులకు విషయం తెలియజేశారు. ఉట్నూర్ ఎస్సై మనోహర్, పోలీసు సిబ్బంది టీంలుగా ఏర్పడి బుధవారం అడవిలో దత్త కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా ఎర్రచెలక గ్రామం సమీపంలో దత్త ఆచూకీ పోలీసులకు లభ్యమైంది. భారీ వర్షం కారణంగా దారితెలియక రాత్రంతా గుట్ట ప్రాంతంలోనే ఉన్నట్లు దత్త తెలిపాడు.

బాధిత మహిళకు తక్షణ సాయం మంజూరు

ఉట్నూర్‌రూరల్: జైనూర్ మండలానికి చెందిన బాధిత మహిళకు ఆపరేషన్, చికిత్స నిమిత్తం తక్షణ సహాయం కోసం ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా రూ.లక్ష మంజూరు చేశారు. ప్రభుత్వం నుంచి వర్తించే పథకాలన్ని స్వల్ప కాలంలో ఇప్పిస్తామని పేర్కొన్నారు. ఏజెన్సీ గ్రామాల భూములు(ఎల్‌టీఆర్) కేసులను త్వరగా పరిష్కారం జరిగేలా చూస్తామని తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మృతి

భైంసారూరల్: మండలంలోని బిజ్జూర్ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి మహారాష్ట్రకు చెందిన జాదవ్ అరవింద్(25) ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందాడు. ఎస్సై శ్రీనివాస్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని రంగశివునికి చెందిన జాదవ్ అరవింద్ మరో ఇద్దరితో కలిసి బుధవారం బిజ్జూర్ గ్రామానికి వచ్చాడు. సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో జారి పడిపోయాడు. నీటి లోతు ఎక్కువగా ఉండడంతో చెరువులో గల్లంతయ్యాడు. రెండు గంటల పాటు శ్రమించి మృతదేహాన్ని గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హుండీ లెక్కింపు

దిలావర్‌పూర్: మండలంలోని అత్యంత ప్రాచీన ప్రాశస్త్యం గల శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయ హుండీని ఆలయ ఈవో భూమయ్య ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. శ్రావణ మాసం పూజల నేపథ్యంలో రూ.4లక్షల8వేల 49ల హుండీ ఆదాయం సమకూరింది. ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు ఉన్నారు.

'అఖండ జ్యోతి ఏర్పాటు అభినందనీయం'



పల్లకి మోస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు: గ్రామంలో పరమహంస సచ్చిదానంద సద్గురు శ్రీ శబరిమాత అఖండ జ్యోతిని 24 ఏళ్లుగా ఏర్పాటు చేయడం అభినందనీయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని అర్లికే గ్రామంలో అఖండ జ్యోతి ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శబరిమాత పల్లకి ఊరేగింపు యాత్రలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు అందరూ కలిసి భక్తిశ్రద్ధలతో నెల రోజుల పాటు కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. శ్రీ శబరిమాత ఆశ్రమానికి ఎలాంటి సమస్య వచ్చినా తనను సంప్రదించాలన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతాంగి బ్రహ్మానంద్, మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, దేవరెడ్డి కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. మండల కన్వీనర్ వెంకటేశ్, ఉపాధ్యక్షుడు ప్రకాశ్, అధికార ప్రతినిధి కిరణ్, అభిరామ్ రెడ్డి, తిరుమల్ గౌడ్, కేద్రేశ్వర్ రెడ్డి, రమాకాంత్, రంజిత్ రెడ్డి, మాజీ సర్పంచ్ పోచన్న, సురేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కిష్టన్న, సుదర్శన్ రెడ్డి, శబరిమాత కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హాస్టల్‌కు వెళ్లనని విద్యార్థి ఆత్మహత్య



చిన్నారెడ్డి (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శంకర్

పెంబి: అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు హాస్టల్‌లో చదువుకుని ఉజ్వల భవిష్యత్తు పొందాలనుకున్న తల్లిదండ్రుల ఆశలు అడియాశలయ్యాయి. హాస్టల్‌కు వెళ్లి చదువుకోవడం ఇష్టంలేని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వడ్డెరగూడెంలో చోటుచేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుమ్మెన ఎంగ్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని వడ్డెరగూడెంకు చెందిన గందారి గంగామణి -ఎల్లయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు నర్సింహులు దుబాయ్ నుంచి తిరిగి వచ్చి వ్యవసాయ పనులు చేస్తున్నాడు. చిన్నవాడు గాందారి చిన్నారెడ్డి (11) కడెం మండలంలోని ఆశ్రమ హాస్టల్‌లో ఉంటూ జెడ్పీఎస్ఎస్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. 15 రోజుల క్రితం చిన్నారెడ్డికి జ్వరం రావడంతో తండ్రి ఎల్లయ్య ఇంటికి తీసుకొచ్చాడు. చికిత్స అందించిన అనంతరం జ్వరం తగ్గడంతో హాస్టల్‌కు వెళ్లి చదువుకోవాలని సూచించాడు. నిరాకరించిన చిన్నారెడ్డి శుక్రవారం వ్యవసాయ పొలంలో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన తండ్రి వెంటనే నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు.